


మనం


కడప | అన్నమయ్య

చిట్వేల్-2 ఎంపీటీసీగా అవకాశం కల్పించండి అభివృద్ధికి కృషి చేస్తా

స్వతంత్ర అభ్యర్థి నాయిని శాంతమ్మ



చిట్వేలీ నవంబర్ 3 మనం న్యూస్: ప్రజల ఆశీస్సులతో ఎంపీటీసీగా ఎన్నికైతే చిట్వేల్-2 పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి నాయిని శాంతమ్మ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి స్వాగతం పలుకుతూ ఆదరణ చూపుతున్నారు. చిట్వేల్-2 ఎంపీటీసీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని శాంతమ్మ హామీ ఇచ్చారు. బ్యాలెట్ నమూనా 5లో ఉంగరం గుర్తును గుర్తించి తమ అమూల్యమైన ఓటును వేసి తనను ఆదరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఉంటూ సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచానని, తనను ఇంటి బిడ్డగా భావించి ప్రజాసేవకు అవకాశం కల్పించాలని నాయిని శాంతమ్మ ఓటర్లను విజ్ఞప్తి చేశారు.



రాజంపేటలో రేనాటి రికార్డు..

వార్డు మారినా గెలుపు జెండా!

యల్లటూరి ఆశీస్సులతో రేనాటి దూకుడు!

మన్నూరు నుంచి రసూల్‌నగర్ వరకు విజయ పరంపర

30వ వార్డు నుంచి 22వ వార్డుకు.. రెండుసార్లు స్వతంత్రుడిగానే విజయం

జనసేన బలపరిచిన అభ్యర్థిగా మరోసారి సత్తా

రాజంపేట రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు

జనసేన బలం.. యల్లటూరి అండ..

రాఘవేంద్ర వర్మకు కలిసొచ్చిన రాజకీయ సమీకరణాలు



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 3

"రాజంపేట మున్సిపల్ రాజకీయాల్లో రేనాటి రాఘవేంద్ర వర్మ మరోసారి తన సత్తా చాటారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మన్నూరు 30వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన ఆయన.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో రసూల్‌నగర్ 22వ వార్డు నుంచి జనసేన బలపరిచిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి గెలుపొందారు. రెండు వేర్వేరు వార్డులు.. రెండు భిన్న రాజకీయ పరిస్థితులు.. అయినా వరుసగా రెండుసార్లూ స్వతంత్ర అభ్యర్థిగానే విజయం సాధించడం రాజంపేట రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. ముఖ్యంగా జనసేన రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి యల్లటూరి శ్రీను ఆశీస్సులు, అండదండలతో రాఘవేంద్ర వర్మ రాజకీయంగా మరింత దూకుడు ప్రదర్శించడం ఈ విజయానికి మరో ప్రత్యేకతను తీసుకొచ్చింది.

గతంలో అధికార వైసీపీ రాజకీయ ప్రభావం ఉన్న సమయంలోనూ స్వతంత్రుడిగా గెలిచిన రాఘవేంద్ర వర్మ.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ తన విజయపరంపరను కొనసాగించారు. ఈసారి జనసేన బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలవడం, యల్లటూరి శ్రీను రాజకీయ అండ లభించడం ఆయనకు కలిసొచ్చిన అంశాలుగా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవైపు జనసేన నాయకత్వం మద్దతు.. మరోవైపు స్థానికంగా సంపాదించు కున్న పరిచయాలు, వ్యక్తిగత ప్రజాబలం.. వెరసి రసూల్‌నగర్ 22వ వార్డులో విజయాన్ని అందించాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.""

యల్లటూరి ఆశీస్సులు..
రేనాటికి రాజకీయ బలం

రాజంపేటలో జనసేన బలోపేతానికి కృషి చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి యల్లటూరి శ్రీను ఆశీస్సులు రాఘవేంద్ర వర్మకు రాజకీయంగా ప్రోత్సాహాన్నిచ్చాయి. జనసేన మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయన విజయం సాధించడంతో స్థానికంగా జనసేన శ్రేణుల్లోనూ ఉత్సాహం నెలకొంది. యల్లటూరి నాయకత్వంపై విశ్వాసంతో ముందుకు సాగుతున్న రేనాటి.. స్థానిక రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

మన్నూరు నుంచి రసూల్‌నగర్ వరకు..

గత ఎన్నికల్లో మన్నూరు 30వ వార్డు నుంచి గెలుపొందిన రాఘవేంద్ర వర్మ.. ఈసారి రసూల్‌నగర్ 22వ వార్డు నుంచి విజయం సాధించడం విశేషం. ఒకే వార్డులో వ్యక్తిగత పట్టును కొనసాగించడం కాకుండా, మరో వార్డులోనూ ప్రజల ఆదరణ పొందడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక పరిణామంగా నిలిచింది.

రెండు ప్రభుత్వాలు..
రెండుసార్లు స్వతంత్ర విజయం

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు స్వతంత్రుడిగా గెలుపు.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన మద్దతుతో మరోసారి విజయం. ప్రభుత్వాలు మారినా తన గెలుపు ప్రయాణాన్ని కొనసాగించడం రాఘవేంద్ర వర్మ ప్రత్యేకత. ఈ క్రమంలో అధికార పార్టీ ప్రభావం కంటే స్థానిక నాయకుల వ్యక్తిగత ప్రజాబలం కూడా ఎన్నికల్లో కీలకమవుతుందనే చర్చకు ఈఫలితం తెరతీసింది.

'బీరువా' గుర్తుకు మరోసారి ప్రజా మద్దతు

ఈసారి 'బీరువా' గుర్తుపై పోటీ చేసిన రేనాటి రాఘవేంద్ర వర్మ విజయం సాధించడం మరో విశేషం.జనసేన రాజకీయ మద్దతును అంది పుచ్చుకుంటూనే స్వతంత్రఅభ్యర్థిగా తన గుర్తింపు ను నిలబెట్టుకున్నారు. దీంతో రాజంపేటలో స్వతంత్ర అభ్యర్థిగా వరుస విజయాలు సాధించిన నాయకుడిగా ప్రత్యేకచర్చకు కేంద్ర బిందువయ్యారు.


రాజంపేటలో కూటమి ప్రభంజనం!

-మున్సిపాలిటీపై రెపరెపలాడిన పసుపు జెండా

-32 వార్డుల్లో 26 కైవసం.. ప్రత్యర్థులు చిత్తు

-పంచాయతీ నుంచి పురపాలికగా మారాక తొలిసారి తెదేపా కైవసం

-పెత్తందారీ కోటలకు బీటలు.. ప్రజలే విముక్తి పలికారు: చమర్తి జగన్‌మోహన్‌రాజు



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 3

రాజంపేట పురపాలికలో కూటమి సునామీ వీచింది! ప్రత్యర్థుల కంచుకోటలను బద్దలు కొడుతూ తెలుగుదేశం--కూటమి అభ్యర్థులు అఖండ విజయాన్ని నమోదు చేశారు. తీవ్ర ఉత్కంఠ నడుమ సాగిన ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యంతో ప్రత్యర్థులను తుత్తునియలు చేశారు.

మొత్తం 32 వార్డులున్న రాజంపేట పురపాలక సంఘంలో చైర్మన్ పదవికి దొంతం గాయత్రి ఇప్పటికే ఏకగ్రీవం కాగా, మంగళవారం 17 వార్డులకు జరిగిన లెక్కింపులో కూటమి ఏకపక్ష జోరు కొనసాగించింది. వెలువడిన ఫలితాల్లో తెదేపా ఏకంగా 10 వార్డులను చేజిక్కించుకోగా, భాజపా 1 స్థానంలో గెలుపొందింది. వైకాపా కేవలం 4 వార్డులకే పరిమితం కాగా, స్వతంత్రులు 2 చోట్ల విజయం సాధించారు. దీంతో మొత్తం 32 వార్డుల్లో కూటమి బలం రికార్డు స్థాయిలో 26 స్థానాలకు చేరి, పురపీఠంపై తిరుగులేని ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది.



అరాచక శక్తుల కబంధహస్తాల నుంచి విముక్తి: చమర్తి జగన్‌మోహన్‌రాజు

అఖండ విజయం అనంతరం రాజంపేట నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యకర్తల సమక్షంలో ఉద్వేగభరితంగా ప్రసంగించారు:

"గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత రాజంపేట పురపాలికపై పసుపు జెండా ఎగరడం ఇదే ప్రథమం. ఇది ప్రజాస్వామ్య విజయం. ఇన్నాళ్లూ పెత్తందార్లు, అరాచక శక్తుల కబంధహస్తాల్లో బందీ అయిన రాజంపేటకు నేటితో సంపూర్ణ విముక్తి లభించింది. అభివృద్ధికి పట్టం కట్టిన రాజంపేట పురప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నాం."

కూటమి సుపరిపాలనపై ప్రజల ఆమోదముద్ర: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి ఈ తీర్పే నిదర్శనమని స్పష్టం చేశారు.

అభివృద్ధి పథంలో రాజంపేట: గత పాలకుల నిర్లక్ష్యంతో కుదేలైన పట్టణాన్ని పరుగులు పెట్టిస్తామని, నూతన పాలక వర్గంతో కలిసి పౌర సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

పసుపుమయమైన రాజంపేట..
మిన్నంటిన సంబరాలు

ఫలితాల ప్రకటనతో రాజంపేట పురవీధులు పసుపు వర్ణాన్ని సంతరించుకున్నాయి. కూటమి శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ విజయదుందుభి మోగించారు. విజేతలతో కలిసి చేపట్టిన భారీ ర్యాలీతో పట్టణ ప్రధాన వీధులు జై తెలుగుదేశం, జై కూటమి నినాదాలతో హోరెత్తాయి





నీటిని పొదుపుగా వినియోగించాలి

భవిష్యత్ తరాలకు జలవనరులను కాపాడాలి: ఫారెస్ట్ రేంజర్ ధీరజ్

చిట్వేలి నవంబర్ 3 మనం న్యూస్: బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం చిట్వేల్ రేంజ్ పరిధిలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కొత్త బస్టాండ్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీశాఖ సిబ్బంది ప్లకార్డులు చేతబట్టి నీటి సంరక్షణకు సంబంధించిన నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు మనిషి జీవనానికి అత్యంత విలువైన సహజ వనరు అని, ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులుతో, ఈకార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది నీటిని వృథా చేయకుండా సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ ధీరజ్, ఎఫ్ఎస్ఓలు శ్రీనివాసులు, సావిత్రి, ఎఫ్బీఓలు కరీముల్లా, వెంకట సుబ్బయ్య, సుబ్బారాయుడు, చంగమ్మ, ఏబీఓ ఈశ్వరయ్య, అటవీశాఖ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గోమాత మృతి



సిద్ధవటం, అక్టోబర్ 3 మనం న్యూస్ : ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గోమాత మృతి చెందింది మండలంలోని మొహద్దీన్ సాహెబ్ పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోశాల కు చెందిన గోమాతలు ప్రతిరోజు కొండ ప్రాంతంలోకి మేతకు వెళ్లి తిరిగి గోశాలకు వస్తాయని ఒక గోమాత కోసం సోమవారం రాత్రి వెళ్తుండగా ఒంటిమిట్ట మండలం మాధవరం హైవే రోడ్డుపై భాకరాపేట నుండి ద్విచక్ర వాహనంలో అతివేగంగా వస్తూ హరీష్ అనే యువకుడు ఢీకొట్టడంతో గోమాత మృతి చెందిందని గోశాల ట్రస్ట్ అధినేత లక్ష్మీ నరసింహ స్వామి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గోమాత మృతి చెందిందని హిందూ సాంప్రదాయంగా ప్రత్యేక పూజలు నిర్వహించి సిద్ధవటం మండలంలోని ఆవుల మారమ్మ గుట్టపై దాన సంస్కారాలు నిర్వహించామని తెలిపారు గోమాత కనబడకుండా పోవడంతో సోమవారం రాత్రి వెతుకుతుండగా హైవే రోడ్డుపై మృతి చెందిందని స్థానికులు తెలిపారని పేర్కొన్నారు


ఉమ్మడి మైలపల్లి అభివృద్ధికి అవకాశం కల్పించండి: భీము మంజుల



చిట్వేలీ నవంబర్ 3 మనం న్యూస్: చిట్వేలి మండలం ఉమ్మడి మైలపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి బీజేపీ–టీడీపీ–జనసేన తరఫున బలపరిచిన భీమూ మంజుల ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. మహిళా శక్తికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు భీమూ మంజుల తెలిపారు. మైలపల్లి, దేమాంచుపల్లి పంచాయతీల పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని, గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఉమ్మడి మైలపల్లి అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించాలని, సైకిల్ గుర్తును గుర్తించి తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని భీమూ మంజుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

సీనియర్ జర్నలిస్టు రఫీకు మున్సిపల్ కమిషనర్ సన్మానం

ప్రొద్దుటూరు నవంబర్ 3 మనం న్యూస్ :జాతీయ జర్నలిస్టుల పురస్కారం అందుకున్న ప్రొద్దుటూరు కు చెందిన సీనియర్ పాత్రికేయులు షేక్ మహమ్మద్ రఫీకు సోమవారం ప్రొద్దుటూరు పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస్ సన్మానం చేశారు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకున్న రఫీ ఉత్తముడిగా పట్టణంలో ప్రసిద్ధిగాంచారని తెలిపారు ప్రతి వార్త ప్రజల కోసమే ప్రతి వ్యాఖ్య అధికారులను కదిలించే విధంగా తల పదునైన కథనాలతో జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు ఇటువంటి జర్నలిస్టుల వల్లే సమాజంలో గుర్తింపు విలువలు పెంపొందుతాయని తెలిపారు మరిన్ని మరిన్ని సంవత్సరాలు మహమ్మద్ రఫీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజల పక్షం నిలబడాలని ఆకాంక్షించారు.



అడుగడుగునా గుత్తి నరసింహకు ప్రజలు బ్రహ్మరథం

ఎన్నికల ప్రచారంలో తగ్గేదే లేదంటూ.. ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా





చిట్వేలీ నవంబర్ 3 మనం న్యూస్: చిట్వేలీ మండలంలో స్వతంత్ర జడ్పీటీసీ అభ్యర్థి రాజుకుంట గుత్తి నరసింహ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయన నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. అడుగడుగునా ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రచారానికి వస్తున్న ప్రజాదరణతో ఆయన అనుచరులు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా గుత్తి నరసింహ మాట్లాడుతూ.. తాను ప్రజల్లో ఒకడినని, ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాయకుడిని ఎన్నుకునేటప్పుడు డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిని ఎంపిక చేసుకోవాలని కోరారు.

పార్టీ కంటే గ్రామం ముఖ్యమని, పదవి కంటే ప్రజాసేవ గొప్పదని, మాటల కంటే చేతల్లో అభివృద్ధి చూపించే నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. చిట్వేలీ మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ఆకాంక్ష అని, ప్రజల సమస్యలకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో, అభిమానంతో ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనకు అమూల్యమైన ఓటును (ఏసి) గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణ తనకు కొండంత బలమని, ఎన్నికల ప్రచారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేదే లేదని, ప్రజల మద్దతుతో విజయం సాధించి చిట్వేలీ మండల అభివృద్ధికి కృషి చేస్తానని స్వతంత్ర జడ్పీటీసీ అభ్యర్థి రాజుకుంట గుత్తి నరసింహ ధీమా వ్యక్తం చేశారు.

జమ్మలమడుగులో 'భూపేశ్' మార్కు రాజకీయం!

- 'చదిపిరాల' వ్యూహం..
- వైరివర్గానికి దిమ్మతిరిగే ఫలితం!
- సతీమణి చైర్‌పర్సన్‌గా చారిత్రక విజయం..
- జిల్లా సారథిగా తిరుగులేని పట్టు

20,237 ఓట్ల భారీ మెజార్టీతో

- జిల్లా రాజకీయాల్లో నయా రికార్డు!

మనం ప్రతినిధి కడప నవంబర్ 3

ఫ్యాక్షన్ గడ్డ.. రాజకీయ చదరంగం జమ్మలమడుగులో సరికొత్త రాజకీయ శకం ఆరంభమైంది. మున్సిపల్ ఎన్నికల వేదికగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చదిపిరాల భూపేష్ రెడ్డి రచించిన వ్యూహం ప్రత్యర్థులకు ఊహించని షాక్ ఇచ్చింది. తన సతీమణి చదిపిరాల జ్యోతిని మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా నిలిపి, ఏకంగా 20,237 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలిపించుకోవడంలో ఆయన నాయకత్వ పటిమ స్పష్టంగా కనిపించింది. దశాబ్దాలుగా పాతుకుపోయిన ప్రత్యర్థి వర్గాలకు కనీసం కోలుకునే అవకాశం కూడా ఇవ్వకుండా క్లీన్ స్వీప్ చేయడంతో జిల్లా రాజకీయాల్లో ఆయన స్థాయి ఒక్కసారిగా అమాంతం పెరిగింది.

కంచుకోటకు బీటలు.. పకడ్బందీ చక్రవ్యూహం!

జమ్మలమడుగు రాజకీయాలంటేనే ఎత్తులు, పైఎత్తులు, గ్రూపు తగాదాలు. కానీ, పార్టీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచే భూపేష్ రెడ్డి తనదైన శైలిలో ముందుకెళ్లారు. పార్టీ శ్రేణుల్లో నయా జోష్ నింపుతూ, వార్డు స్థాయి నుంచి బలమైన కేడర్‌ను నిర్మించారు.

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచే వార్డుల వారీగా ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించారు.

ప్రత్యర్థుల బలహీనతలను పసిగట్టి, అసంతృప్త నేతలను, సామాజిక వర్గాలను సమన్వయం చేయడంలో సమయస్ఫూర్తి కనబరిచారు.

ప్రచారంలో ఎక్కడా దూకుడు తగ్గకుండా, ప్రతి ఓటరు గుమ్మం తొక్కేలా రూపొందించిన రోడ్‌మ్యాప్ ప్రత్యర్థి శిబిరానికి ఊపిరాడకుండా చేసింది.

నమ్మకమే ఆయుధం.. సేవాపథమే పునాది!

చదిపిరాల కుటుంబానికి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని భూపేష్ రెడ్డి రాజకీయ బలంగా మలిచారు. ఆడంబరాలకు పోకుండా ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే వ్యక్తిత్వం, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే స్వభావం ఓటర్లలో బలమైన నమ్మకాన్ని కలిగించింది. సతీమణి జ్యోతి విద్యావంతురాలు, సేవాభావం కల మహిళ కావడం, ఆమె అభ్యర్థిత్వాన్ని ముందుంచడం మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. 'మాట కాదు.. చేతల్లో చూపిస్తాం' అంటూ ఆయన ప్రజలకు ఇచ్చిన భరోసా ఓట్ల వర్షం కురిపించింది.

ఓట్ల వెల్లువలో కొట్టుకుపోయిన ప్రత్యర్థులు!

మొత్తం లెక్కించిన 30,258 ఓట్లలో తెదేపా ఏకంగా 25,066 ఓట్లు సాధించడం భూపేష్ రెడ్డి నెట్‌వర్క్ పనితీరుకు నిదర్శనం. వైకాపా కేవలం 4,829 ఓట్లకే పరిమితమై డిపాజిట్ కోల్పోయే స్థితికి చేరడం ప్రత్యర్థి శిబిరానికి చావుదెబ్బ. ప్రత్యర్థులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, రాజకీయ ఒత్తిళ్లు తెచ్చినా వెరవకుండా ఆయన నడిపించిన తీరుతో మొత్తం పోలైన ఓట్లలో 82 శాతానికి పైగా తెదేపా ఖాతాలోకి వచ్చి పడ్డాయి.

జిల్లా రాజకీయాల్లో తిరుగులేని 'బాస్'!

వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా భూపేష్ రెడ్డి సామర్థ్యానికి ఈ మున్సిపల్ ఫలితం ఒక అగ్నిపరీక్ష కాగా, అందులో ఆయన నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. సొంత గడ్డపై తెదేపా జెండాను రెపరెపలాడించి పార్టీ అధిష్ఠానం వద్ద తిరుగులేని విశ్వసనీయతను సాధించారు. ఆయన వ్యూహాత్మక ఆలోచనలు, కేడర్‌ను ముందుండి నడిపించే శైలి చూస్తుంటే.. రాబోయే రోజుల్లో కడప జిల్లా రాజకీయాల్లో చదిపిరాల భూపేష్ రెడ్డి ప్రభంజనం మరింత బలంగా విస్తరించడం ఖాయమని స్పష్టమవుతోంది.

ఒంటిమిట్టలో కూటమి అభ్యర్థుల తరఫున విస్తృత ప్రచారం

చిన్నకొత్తపల్లి, గంగపేరూరు, ఇబ్రహింపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టిన అతికారి కృష్ణ



ఒంటిమిట్ట, నవంబర్ 3 మనంన్యూస్: జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో చివరి రోజు ప్రచారంలో భాగంగా ఒంటిమిట్ట మండలంలో కూటమి అభ్యర్థుల తరఫున రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని చిన్నకొత్తపల్లి, గంగపేరూరు, ఇబ్రహింపేట తదితర గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి కోనేటి హరి వెంకటరమణ, జడ్పీటీసీ అభ్యర్థి కదిరి విజయమ్మలను పరిచయం చేస్తూ వారి తరఫున ఓట్లు అభ్యర్థించారు. ఎంపీటీసీ అభ్యర్థి కోనేటి హరి వెంకటరమణకు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి కదిరి విజయమ్మకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని వివరిస్తూ, ప్రజలు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 5న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలకు స్వస్తి.. చిట్వేలి మండల అభివృద్ధే నా లక్ష్యం





జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి బుంగటవుల భాస్కర్

చిట్వేలీ నవంబర్ 3 మనం న్యూస్: ప్రజల ఆశీస్సులతో జడ్పీటీసీగా ఎన్నికైతే చిట్వేలీ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి బుంగటవుల భాస్కర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిట్వేలీ మండలంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ జనసందోహంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజల మధ్యకు వెళ్లి గడపగడపకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాలెట్‌లో కుక్కర్ గుర్తుకు ఓటు వేసి తనను జడ్పీటీసీగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని, తనకు ఒక అవకాశం కల్పించి కుక్కర్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని బుంగటవుల భాస్కర్ ప్రజలను కోరారు.



మాజీ ఎమ్మెల్యేపై ఫోర్జరీ ఆరోపణలు

పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు, నవంబర్ 3 మనంన్యూస్:వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తన సంతకాన్ని, లెటర్ ప్యాడ్‌ను ఫోర్జరీ చేసి తప్పుడు ప్రచారానికి చేస్తున్నాడని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకు కాకుండా ఓసీ జనరల్‌కు కేటాయించాలని, తన తమ్ముడు రాఘవరెడ్డికి ఆ పదవి ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు రాసినట్లుగా ఒక నకిలీ లేఖను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ దొంగ లేఖ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ?బీసీల సంక్షేమంపై మాట్లాడే హక్కు రాచమల్లుకు లేదని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి విమర్శించారు. గత వైసీపీ హయాంలో భీమునిపల్లి లక్ష్మీదేవిని మున్సిపల్ చైర్మన్ చేసినప్పటికీ, ఆమెను కేవలం సంతకాలకే పరిమితం చేసి నిర్ణయాలన్నీ రచమల్లు కుటుంబ సభ్యులు తీసుకున్నారని మండిపడ్డారు. చివరికి ఆమె ఎన్నికల ఖర్చు కోసం తన ఇల్లు కూడా అమ్ముకోవాల్సి వచ్చిందని వరదరాజుల రెడ్డి తెలిపారు. ఫోర్జరీ సంతకాలు చేయడం, దొంగ లేఖలతో ప్రజలను, బీసీ వర్గాలను తప్పుదోవ పట్టించడం రాచమల్లుకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, పార్టీపై బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని రచమల్లు కు హెచ్చరించారు.. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ నంద్యాల రాఘవరెడ్డి, టిడిపి కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.